సాక్షి నల్లగొండ

గురువారం ౹ 13 ౹ జులై ౹ 2023



ఎడమ కాల్వకు నీటి విడుదల

ఖమ్మం జిల్లా తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ఎడమకాల్వకు బుధవారం నీటిని విడుదల చేశారు. - 10లో



నేడు 'కొమర్రాజు' శతవర్ధంతి సభ

నడిగూడెం కోటలో దివాన్‌గా పనిచేసిన చిత్రకారుడు కొమర్రాజు వెంకటలక్ష్మణరావు శతవర్ధంతి సభకు ఏర్పాట్లు చేశారు. - 10లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34°/25°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మత్స్యకారులకు సబ్సిడీపై వాహనాలు

నల్లగొండ టూటౌన్ : మత్స్య శాఖ, ప్రధాన మంత్రి సంపద యోజన కార్యక్రమం కింద మత్స్యకారులకు సబ్సిడీపై సంచార, మూడు చక్రాల వాహనాలు, ఐస్ బాక్స్‌లు ఇవ్వనున్నట్లు మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన మత్స్యకారులు కలెక్టరేట్ సముదాయంలోని మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మొదట దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.

ఐటీఐలో రెండవ విడత అడ్మిషన్లు

రామగిరి(నల్లగొండ) : ఐటీఐలో రెండవ విడత అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు నల్లగొండ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం జూలై 31వ తేదీలోపు www.iti.telangna.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటే కార్యక్రమంలో తండా వాసులు

దేవరకొండ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్ అన్నారు. బుధవారం నాబార్డు 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తండాలో మొక్కలు నాటి మాట్లాడారు. అనంతరం నాబార్డు ద్వారా అమలు చేస్తున్న పథకాలను తండా వాసులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్ అధ్యక్షుడు ఖాజాఖైరత్‌అలీ, శ్రీనునాయక్, కిషన్‌బావోజీ ఉన్నారు.

దేవరకొండ డీఎస్పీగా గిరిబాబు

దేవరకొండ : దేవరకొండ డీఎస్పీగా గిరిబాబును నియమిస్తూ డీజీపీ అంజనీకుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవరకొండలో పని చేస్తున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావును హెడ్ ఆఫీస్‌కు అటాచ్ చేశారు.

ధాన్యం తరుగుపై విచారణ

మర్రిగూడ : మర్రిగూడ, యరగండ్లపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధిక తరుగు తీశారని వచ్చిన ఆరోపణలపై డీసీఓ రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు విచారణ అధికారులు శరత్‌కుమార్, అయూబ్ బుధవారం రైతుల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 మంది రైతుల నుంచి వాంగ్మూలం సేకరించామని తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు. వారి వెంట సీఈఓ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● పేటలో రాశిఖన్నా



సినీ నటి రాశి ఖన్నా బుధవారం సూర్యాపేటలో మాంగళ్యషాపింగ్ మాల్‌ను ప్రారంభించేందుకు వచ్చారు. ఆమెను చూసేందుకు అభిమానులు, ప్రజలు భారీగా తరలిరావడంతో షాపింగ్ మాల్ వద్ద కోలాహలం నెలకొంది.

నిరసన హోరు



ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం నల్లగొండలోని క్లాక్‌టవర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు



వ్యవసాయానికి ఉచిత విద్యుత్ 8 గంటలు కూడా ఇవ్వడం లేదంటూ కొండమల్లేపల్లిలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దరఖాస్తుల సవరణకు అవకాశం

రామగిరి(నల్లగొండ) : కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వివిధ పోస్టులల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేయడానికి ఆన్‌లైన్ పరీక్షకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు జూలై 15వ తేదీ లోపు వివరాలను సవరించుకునే అవకాశం ఉందని డీఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా వివరాలు సవరించుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 73866 60584 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సాగు.. వెనుకకే!

వర్షాభావ పరిస్థితులతో తగ్గిన పంటల సాగు

- కొన్ని చోట్ల మొలకెత్తని పత్తి విత్తనాలు.. మొలిచినా వాడుతున్న మొలకలు
- వరి నాట్లు వేసుకునేందుకు ధైర్యం చేయని అన్నదాతలు
- సీజన్ ప్రారంభమై 50 రోజులు గడిచినా లోటు వర్షపాతమే..
- ఆందోళనలో రైతాంగం



తిరుమలగిరి సాగర్ మండలం గాత్‌తండాలో స్ప్రింక్లర్ల ద్వారా పత్తి చేనుకు నీరు అందిస్తున్న రైతు

నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సాగు వెనుకంజలో పడింది. సీజన్ ఆరంభమై యాభై రోజులు గడిచినా నేటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు రాకపోవడంతో సాగు భారీగా తగ్గింది. ఈ ఏడాది వ్యవసాయ శాఖ అంచనాల మేరకు సాగు అవుతుందో లేదోనన్న అనుమానం కలుగుతోంది. జూన్ మూడవ వారంలో నైరుతి రుతుపవనాల రాక ఆరంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో లోటు వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు పంటల సాగుపై ఆందోళన చెందుతున్నారు. వారం నుంచి రోజూ మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు మాత్రమే కురుస్తున్నాయి. వర్షాభావం కారణంగా పత్తి విత్తనాలు విత్తుకున్న చాలా ప్రాంతాల్లో మొలకెత్తలేదు. కొన్ని చోట్ల మొలకలు వచ్చినా వాడిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు మొలకలను రక్షించుకోవడానికి భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు.

కొన్ని మండలాల్లో సాగు ఊసే లేదు..

నాంపల్లి, మునుగోడు, మర్రిగూడ, గుర్రంపోడు, దేవరకొండ, చందంపేట, చండూరు, చింతపల్లి మండలాల్లో పత్తిని విత్తుకోగా మిగిలిన మండలాల్లో పత్తి సాగు ఊసే లేకుండా పోయింది. వరి మాత్రం నాన్ ఆయకట్టు ప్రాంతమైన నల్లగొండ, కనగల్, శాలిగౌరారం, నార్కట్‌పల్లి మండలాల్లో మాత్రమే కొంత మేర సాగైంది. మిగిలిన మండలాల్లో నార్లు పోసుకున్నప్పటికీ వర్షాలు లేని కారణంగా బోర్లు సరిగ్గా పోయకపోవడంతో నాట్లు వేసేందుకు రైతులు ధైర్యం చేయడం లేదు. నాగార్జునసాగర్ ఆయకట్టులో మాత్రం ఈ పాటికే సుమారు 80 వేల ఎకరాల్లో వరి నాట్లు వేసుకునేవారు కానీ ప్రస్తుత కొన్ని ప్రాంతాల్లో మాత్రమే నార్లు పోసుకుని నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. సాగర్ ప్రాజెక్టు నిండి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తేనే అక్కడ పూర్తిస్థాయిలో వరినాట్లు వేసుకునే అవకాశం ఉంటుంది.

ఇప్పటి వరకు సాగు వివరాలు ఇలా.. (ఎకరాల్లో)

పంట	అంచనా	గతేడాది	ప్రస్తుతం
పత్తి	6,50,000	4,95,000	4.29.000
వరి	5,25,000	45,785	12,000

వర్షపాతం వివరాలు ఇలా (మిల్లీమీటర్లలో)

నెల	కురవాల్సింది	గతేడాది	ప్రస్తుతం
జూన్	83.2	93.1	25.0
జూలై	128.9	248.1	25.0 (12వ తేదీ వరకు)

అధిక మండలాల్లో లోటు వర్షపాతం..

జిల్లాలోని నకిరేకల్ మండలంలో అత్యధిక వర్షం కురిసింది. నార్కట్‌పల్లి, కట్టంగూరు, శాలిగౌరారం, కనగల్, నాంపల్లి, తిప్పర్తి మండలాల్లో అధిక వర్షం కురిసింది. కేతేపల్లి, మర్రిగూడ, చింతపల్లి, గుర్రంపోడు, మాడ్గులపల్లి, దేవరకొండ మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. చిట్యాల, నల్లగొండ, మునుగోడు, చండూరు, అనుముల, నిడమనూరు, త్రిపురారం, వేములపల్లి, మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, తిరుమలగిరిసాగర్, పెద్దవూర, పీఏపల్లి, కొండమల్లేపల్లి, డిండి, చందంపేట మండలాలో సాధారణ కంటే లోటు వర్షం కురిసింది. నేరెడుగొమ్ము, గట్టుప్పల్ మండలాల్లో మాత్రం అత్యంత లోటు వర్షం కురిసింది.

నార్లుపోసుకుని వాన కోసం చూస్తున్నాం



నార్లు పోసుకుని నాట్లు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. వర్షం వస్తే వెంటనే పొలాన్ని దమ్ముచేసుకుని నాట్లు వేసుకుంటా. వర్షం రాకపోవడం వల్ల నాట్లు ఆలస్యమవుతున్నాయి. వర్షం కోసం రైతులంతా వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

– యాదయ్య, రసూల్‌పురం, నల్లగొండ మండలం

పత్తి మొలకలు వాడు పడుతున్నాయి



పది ఎకరాల్లో పత్తి చేను వేశా. అప్పటి వర్షానికి విత్తనాలు మొలకెత్తాయి కానీ ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో మొలకలు వాడుపడుతున్నాయి. డ్రిప్పు ఏర్పాటు చేసి మూడు ఎకరాలకు నీటిని పెడితో రూ.30 వేల వరకు ఖర్చు వచ్చింది. మిగిలిన ఏడు ఎకరాలలో డ్రిప్పు ఏర్పాటు చేసుకునే స్థోమత లేకపోవడం మొలకలు ఎండిపోతున్నాయి. వర్షాలు వస్తేనే పత్తి బతుకుతుంది.

– భాస్కర్, కొంపెల్లి, మునుగోడు మండలం

పది మంది కంటే తక్కువగా ఉంటే..

పాఠశాల మూసివేత!

- అధికారుల మౌఖిక ఆదేశాల మేరకు ఎంఈఓల చర్యలు
- సమీప స్కూళ్లలో టీచర్లు, విద్యార్థుల సర్దుబాటు
- తండాల్లోని పాఠశాలల్లోనే తక్కువ మంది విద్యార్థులు



ఇటీవల మూతబడిన తిరుమలగిరి సాగర్ మండలం నెల్లికల్లు పాఠశాల

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో పది మందికంటే తక్కువ మంది విద్యార్థులు ఉన్న స్కూళ్లను మూసివేయాలని జిల్లా విద్యా శాఖ నిర్ణయానికి వచ్చింది. జిల్లా విద్యాశాఖ అధికారులు జారీ చేసిన మౌఖిక ఆదేశాల మేరకు ఎంఈఓలు ఈ మేరకు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే పదుల సంఖ్యలో పాఠశాలలు మూతబడగా, ప్రస్తుత నిర్ణయంతో మరిన్ని స్కూళ్లు మూతపడబోతున్నాయి. మూసివేసే స్కూళ్లల్లోని విద్యార్థులు, టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ కూడా తక్కువ మంది విద్యార్థులు ఉన్న స్కూళ్ల విషయంలో అధికారికంగా నిర్ణయం ప్రకటించకపోయినా, మౌఖికంగా అలాంటి స్కూళ్లను మూసేసి, అక్కడి విద్యార్థులను సమీపంలోని పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని పేర్కొంది. మరోవైపు టీచర్లను ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న స్కూళ్లకు పంపాలని స్పష్టం చేసింది.

ఓవైపు లెక్కలు.. మరోవైపు మూసివేత

విద్యాశాఖ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల (సీఆర్‌పీ) ద్వారా ఏ మండలంలోని ఏ పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? ఎంత మంది టీచర్లు ఉన్నారనే సమాచారాన్ని సేకరిస్తోంది. ఎంఈఓలకు వస్తున్న సమాచారం అధారంగా ఆయా స్కూళ్లను ఒక్కొక్కటిగా మూసివేస్తున్నారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాలో 15 స్కూళ్లను మూసి వేయగా, మరో 55 స్కూళ్లలో పది మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్నవి ఉన్నట్లుగా గుర్తించినట్లు తెలిసింది. ప్రస్తుతం వాటన్నింటిని మూసివేసే దిశగా చర్యలు చేపడుతోంది.

క్షేత్ర స్థాయి పరిస్థితుల ఆధారంగా..

ప్రస్తుతం క్షేత్రస్థాయిలో చేస్తున్నది తాత్కాలిక సర్దుబాబు మాత్రమేనని మండల స్థాయిలోని అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు వస్తే కొనసాగిస్తామని, విద్యార్థులు రాని చోట మాత్రం మూసివేత తప్పదన్న సంకేతాలను ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను బట్టి, విద్యార్థులు వచ్చి చేరే అవకాశం ఉందా? లేదా?అన్న దానిని బట్టి నిర్ణయం తీసుకునేలా ఎంఈఓలను విద్యాశాఖ ఆదేశించింది. ప్రస్తుతం జిల్లాలో 1483 స్కూళ్లు ఉండగా, ఈసారి ఎన్ని మూత పడతాయో, ఎన్ని తిరిగి ప్రారంభం అవుతాయో నెలాఖరుకు స్పష్టత రానుంది.

తండాల్లోనూ మూసివేతేనా?

జిల్లాలో ప్రస్తుతం మూసివేసే పాఠశాలల జాబితాలో నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ నియోజకవర్గాల్లోని తండాలకు చెందిన ఎక్కువగా స్కూళ్లే ఉన్నాయి. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి సాగర్ మండలాన్ని ఉదాహరణగా తీసుకుంటే ఇప్పటికే 10 స్కూళ్లు మూత పడ్డాయి. మరో 11 స్కూళ్లలో విద్యార్థులు పది మందికంటే తక్కువ మంది ఉన్నారు. దీంతో వాటిని మూసివేసే దిశగా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. త్రిపురారం మండలంలోనూ అదే పరిస్థితి ఉంది. వాస్తవానికి తండాల్లో నివసించేది నిరుపేద కుటుంబాలకు చెందిన గిరిజనులే. వారిలో ఎక్కువ మంది నిరక్షరాస్యులు ఉన్నారు. పిల్లలను రోజూ కూలికి తీసుకెళ్లే కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయి. అలాంటి వారిలో అవగాహన కల్పించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంది.

విద్యార్థులు పెరిగే అవకాశం ఉంటే కొనసాగిస్తున్నాం



పాఠశాలల్లో ప్రవేశాలకు ఈనెలాఖరు వరకు సమయం ఉంది. అప్పటి వరకు ప్రవేశాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చాం. విద్యార్థులు వస్తారా? లేదా? అనే దానిపై నెలాఖరుకు పూర్తిస్థాయి స్పష్టత వస్తుంది. ఇప్పుడు కూడా విద్యార్థులు పెరిగే అవకాశం ఉన్న స్కూళ్లను కొనసాగించేలా చర్యలు చేపడుతున్నాం. మరీ ఇద్దరు, ముగ్గురు విద్యార్థులే వస్తే సమీప స్కూళ్లలో సర్దుబాటు చేస్తాం.

– భిక్షపతి, డీఈఓ

బూడిదగట్టు తీరానికి నావెల్ క్యాడెట్స్



సాగర్ జలాశయం తీరంలో గల బూడిదగట్టు సమీపంలో సెయిలింగ్

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయంలో ఆంధ్రా–తెలంగాణ నావెల్ క్యాడెట్స్ ఈ నెల 5వ తేదీ నుంచి సెయిలింగ్, విండ్‌సర్ఫ్ శిక్షణను పొందుతున్నారు. ఈ శిక్షణలో భాగంగా బుధవారం హిల్‌కాలనీ విజయవిహార్ నుంచి పెద్దఅడిశర్లపల్లి మండలంలోని బూడిదగట్టు సమీపంలోగల జలాశయ తీరం వెంట తిరిగారు. జలాశయంలో సెయిలింగ్, విండ్ సర్ఫింగ్ చేశారు. జలాశయ తీరంలోని పచ్చిక బయళ్లపై కూర్చొని ఫొటోలు దిగి ఆహ్లాదంగా గడిపారు. వీరు తమ శిక్షణ కాలంలోని పది రోజుల్లో జలాశయంలో 210 కిలోమీటర్ల మేర తిరుగాల్సి ఉంది. బుధవారం వారు 20 కిలోమీటర్లు వెళ్లి వచ్చారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

● డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

మిర్యాలగూడ అర్బన్ : గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఏడు రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, తమ పార్టీ అధికారంలోకి రాగానే గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కృష్ణయ్య, నాయకులు పాదిల శ్రీను, సలీం, బసవయ్య, వెంకన్న, బక్కారెడ్డి, నరసింహారెడ్డి తదితరులున్నారు.



సంఘీభావం తెలుపుతున్న శంకర్‌నాయక్

సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

నల్లగొండ టూటౌన్ : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు కోరారు. రథయాత్ర వాల్ పోస్టర్లను బుధవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న నల్లగొండలో గడియారం సెంటర్ నుంచి ఎన్జీ కాలేజీ వరకు, 18న మిర్యాలగూడలో అమరవీరుల స్థూపం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు సంకల్ప రథయాత్ర ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి అందుగుల విజయ్, నాగవెల్లి ఉపేందర్, సురేందర్‌సింగ్, పంకజ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, సైదయ్య, యాదగిరి, తిరుపతి, ఏడుకొండలు, రవి, సైదులు, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

● కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నోడల్ అధికారులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లతో ఓటరు జాబితా సవరణకు వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మే 25 నుంచి ఈ నెల 23 వరకు ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టిందని.. దీనిపై ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని చెప్పారు. ఈ నెల 27న ఈఆర్‌ఓ నెట్ క్లోజ్ అవుతుందని, ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై ఇంటింటి సర్వే నిర్వహించి విచారించిన కారణాలు తెలుపుతూ పక్కాగా దరఖాస్తులు పరిష్కరించి ఆన్‌లైన్‌లో అప్‌డేషన్ చేయాలని సూచించారు. ఒకే ఇంటి నంబర్‌పై ఆరు కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే పరిశీలించి అడ్రస్ తప్పు ఉంటే ఫారం–8 ద్వారా సవరణ, ఓటర్ తప్పుగా ఉంటే ఫారం –7 ద్వారా తొలగించాలని సూచించారు. దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ ఓటర్ల డేటా తీసుకొని నమోదు అయ్యారా లేదా పరిశీలించి మార్కింగ్ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, అదనపు ఎస్పీ కెఆర్‌కె ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

దేవరకొండ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన నీటి పారుదల ప్రాజెక్‌లు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు సంబంధించి భూ సేకరణ, నష్టపరిహారం చెల్లింపు, ఆర్‌అండ్‌ఆర్ కింద పునరావాస చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో డిండి ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన రిజర్వాయర్‌ల భూ నిర్వాసితులు, ఏఎమ్మార్పీకి సంబంధించి భూసేకరణ, నిర్వాసితులకు చెల్లింపు, పునరావాస చర్యలు, ప్రాజెక్టుల ప్రగతిపై అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌లు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశమై ప్రాజెక్ట్‌ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కాలనీల్లో లేఅవుట్ పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆస్పత్రిలో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి


వృద్ధురాలి మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చేరిన గుర్తుతెలియని వృద్ధురాలు(80) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరైనా ఉంటే మిర్యాలగూడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ క్రిష్ణయ్య తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగోజిగూడెం గ్రామంలోని దివీస్ ఫార్మా కంపెనీ పక్కన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు డ్రా చేసుకునేందుకు వచ్చారు. అనంతరం ఏటీఎంలో నగదు నిల్వ చేసే బాక్స్‌ను తెరిచేందుకు యత్నించారు. అది రాకపోవడంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు. బుధవారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఆలేరురూరల్: జీవితంపై విరక్తితో రైలు కింద పండి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలేరు శివారులో రైలు పట్టాలపై బుధవారం చోటుచేసుకుంది. భువనగిరి రైల్వే ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన గూడెపు వెంకటేశ్(33) గతంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కొద్ది నెలలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. అవివాహితుడైన వెంకటేష్ జీవితంపై విరక్తితో బుధవారం ఉదయం ఆలేరు శివారులో రైలు పట్టాల వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు.

ఉరి వేసుకొని..

హుజూర్‌నగర్: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన హుజూర్‌నగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన కుమ్మరికుంట్ల నాగేశ్వరరావు(50) గత కొన్నేళ్లుగా స్థానిక గాంధీ పార్క్ చౌరస్తాలో బజ్జీల బండి నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయనకు భార్య లత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల అతడు మద్యానికి బానిసై వ్యాపారం సరిగా చేయడం లేదు. దీంతో ఇంట్లో తరచూ భార్యాపిల్లలతో గొడవ పడుతుండేవాడు. మద్యం మానమని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినడం లేదు. కాగా బుధవారం భార్యాపిల్లలు షాపు వద్దకు వెళ్లగా.. నాగేశ్వరరావు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్ టవర్ల బ్యాటరీ దొంగల అరెస్ట్

- యాదగిరిగుట్టలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వారి నుంచి కారు, రూ.55వేల నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్, వెనుక నిందితులు వినోద్, భానుప్రసాద్

యాదగిరిగుట్ట: జల్సాలకు అలవాటు పడి.. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో సెల్ టవర్ల వద్ద బ్యాటరీల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను బుధశవారం యాదగిరిగుట్టలో పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.55వేల నగదుతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణానికి చెందిన మాదాసు వినోద్, మాదాసు భానుప్రసాద్ కొంతకాలంగా సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సెల్ టవర్లలో వినియోగించే విద్యుత్ బ్యాటరీలను దొంగిలించి హైదరాబాద్‌లో అమ్ముకుంటున్నారు. ఇటీవల కాలంలో యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో ఓ సెల్‌ఫోన్ టవర్ వద్ద సుమారు 16 బ్యాటరీలను దొంగిలించారు. దీంతో పట్టణ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని యాదగిరిపల్లి చౌరస్తాలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో అటువైపు వెళ్తున్న మాదాసు వినోద్, మాదాసు భానుప్రసాద్ అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు వారి కారును తనిఖీ చేయగా అందులో దొంగతనానికి వినియోగించే పనిముట్లు కనిపించాయి. వాటి గురించి ప్రశ్నించగా.. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా.. సెల్ టవర్లలో ఉండే విద్యుత్ బ్యాటరీలను దొంగతనం చేసి హైదరాబాద్‌లో అమ్ముకుంటున్నట్లు నిజం ఒప్పుకున్నారు.

ఇప్పటి వరకు 89 బ్యాటరీలు చోరీ..

నిందితులు ఇద్దరు మోటకొండూర్ మండలంలో 24 బ్యాటరీలు, రాజాపేట మండలం సింగారంలో 17, బేగంపేటలో 16 బ్యాటరీలు, రంగారెడ్డి జిల్లా అబ్దులాపూర్‌మెట్‌లో 16 బ్యాటరీలు, యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో 16తో కలిపి మొత్తం 89 బ్యాటరీలు దొంగిలించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. వారి నుంచి బ్యాటరీలు అమ్మగా వచ్చిన రూ.55వేల నగదుతో పాటు కారును స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. వీరికి సహకరించిన పరమేశ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ రమేష్, కానిస్టేబుళ్లు లింగస్వామి, విజయ్, గోవింద్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

'పేట'లో మాంగళ్య షాపింగ్‌మాల్ ప్రారంభం


మాంగళ్య షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బడుగుల, ఎమ్మెల్సీ రవీందర్‌రావు


పట్టుచీరను చూపిస్తున్న సినీ హీరోయిన్ రాశి ఖన్నా, చిత్రంలో కాసం నమశ్శివాయ

- సందడి చేసిన సినీ హీరోయిన్ రాశి ఖన్నా

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మాంగళ్య షాపింగ్‌మాల్‌ను బుధవారం రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ప్రారంభించారు. ఈ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి ప్రముఖ సినీ హీరోయిన్ రాశి ఖన్నా హాజరై సందడి చేశారు. రాశి ఖన్నాను చూడటానికి అభిమానులు, పట్టణ ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సరికొత్త నూతన వస్త్ర ప్రపంచం నేడు సూర్యాపేట పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. అతి తక్కువ ధరలకే మాంగళ్య షాపింగ్ మాల్‌లో షాపింగ్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో షాపింగ్ మాల్ నిర్వాహకులు పీఎన్ మూర్తి, పుల్లూరు అరుణ్, కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కేదారీనాథ్, శివప్రసాద్, తోడుపునూరు కార్తీక్, అరుణ్, కొల్లూరు వరుణ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.


అభిమానులకు అభివాదం చేస్తున్న సినీ హీరోయిన్ రాశి ఖన్నా

46 మంది హిజ్రాల బైండోవర్


హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న వన్ టౌన్ సీఐ రాఘవేందర్

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం హిజ్రాలు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం రాళ్లతో దాడి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో 46మంది హిజ్రాలను బాధ్యులు చేస్తూ వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు వన్ టౌన్ సీఐ రాఘవేందర్ తెలిపారు. వారందరికీ బుధవారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ హిజ్రాలు డబ్బులు డిమాండ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హిజ్రాల వలన ప్రజలు ఇబ్బంది పడితే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

నలుగురు బాలకార్మికులకు విముక్తి

నకిరేకల్: పట్టణంలోని వివిధ షాపుల్లో బాల కార్మికులతో పనిచేయిస్తున్నారన్న సమాచారంతో నల్లగొండ ఆపరేషన్ ముస్కాన్ టీం ఇన్‌చార్జి ఎస్‌ఐ పి. శంకరయ్య ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు బాల కార్మికులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు బాల కార్మికులను పనిలో పెట్టుకున్న షాపుల యజమానులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ గోపి కృష్ణ తెలిపారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. బాలిక ఆత్మహత్య

- నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు


స్వాతి (ఫైల్)

మిర్యాలగూడ: ప్రేమోన్మాది వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన దామరచర్ల మండంలోని గణేష్‌పహాడ్‌లో చోటుచేసుకుంది. బుధవారం దామరచర్ల ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్‌పహాడ్ గ్రామానికి చెందిన కొర్ర రెడ్యా, విజయ దంపతులకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. మూడో కుమార్తె కొర్ర స్వాతి(17) సూర్యాపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మెగావత్ హుస్సేన్ ఐటీఐ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. హుస్సేన్ గత కొన్ని నెలలుగా ప్రేమ పేరుతో స్వాతిని వేధిస్తున్నాడు. తరచూ ఫోన్లు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ విషయాన్ని స్వాతి తన తల్లిదండ్రులకు చెప్పగా వారు హుస్సేన్‌ను మందలించారు. అయినా తీరు మారని హుస్సేన్ స్వాతిని ప్రేమ పేరుతో వేధించసాగాడు. దీంతో విసుగు చెందిన స్వాతి సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయి గణేష్‌పహాడ్ గ్రామ పరిధిలో కృష్ణా నది ఒడ్డున గల పంప్‌హౌజ్ పైనుంచి కిందకు నదిలోకి దూకింది. స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం కృష్ణా నదిలో స్వాతి మృతదేహం లభ్యమైంది. నిందితుడు హుస్సేన్ పరారీలో ఉన్నాడని, అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్వాతి తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైస్‌మిల్లులో హమాలీ మృతి


అమిత్‌కుమార్ మృతదేహం

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో గల సాయిబాలాజీ రైస్‌మిల్లులో బుధవారం ప్రమాదవశాత్తు డైఎలివేటర్ పుల్లి ఊడి మీద పడటంతో బిహార్ రాష్ట్రానికి చెందిన హమాలీ మృతి చెందాడు. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం పూర్ణియా జిల్లా బస్‌వంకి గ్రామం హనుమాన్‌నగర్‌కు చెందిన అన్నదమ్ములు బిక్కి కుమార్, బిక్కి అమిత్‌కుమార్(21) శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని సాయిబాలాజీ రైస్‌మిల్లులో తొమ్మిది నెలలుగా హమాలీ పనిచేస్తున్నారు. రోజుమాదిరిగా మంగళవారం సాయంత్రం అమిత్‌కుమార్ మిల్లుకు వెళ్లాడు. అతడు పనిలో ఉండగా అర్ధరాత్రి దాటిన తర్వాత ప్లాంట్ సెక్షన్‌లో డైఎలివేటర్ పైన ఉన్న పుల్లి ఊడిపోయి అమిత్‌కుమార్ తలపై పడింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయం కాగా, అక్కడే ఉన్న హమాలీ మేస్త్రీ చెంచల్ కుమార్ 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే అమిత్ కుమార్ మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి అన్న బిక్కి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ చేస్తూ పోలీసులకు చిక్కిన దొంగ

- యాదాద్రి ఆలయంలో మహిళ మెడలో పుస్తెలతాడు అపహరించేందుకు యత్నం


ఎస్‌పీఎఫ్ పోలీసుల అదుపులో నిందితుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ముఖ మండపంలో బుధవారం ఓ మహిళా భక్తురాలి మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును దొంగిలిస్తున్న వ్యక్తిని ఎస్‌పీఎఫ్ పోలీసులు, ఆలయ సురక్ష సిబ్బంది గుర్తించి పట్టుకున్నారు. ఎస్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తురాలు తన భర్తతో కలిసి స్వామి వారిని సాయంత్రం 7గంటల సమయంలో దర్శించుకొని, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తోంది. ఈ సమయంలో ఆమె మెడలో నుంచి యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన నరేష్ అనే వ్యక్తి సుమారు 3తులాల బంగారు పుస్తెలతాడు అపహరించేందుకు యత్నించాడు. అదే సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆలయ సురక్ష సిబ్బంది గుర్తించి ఎస్‌పీఎఫ్ పోలీసులకు చెప్పడంతో వెంటనే వారు అక్కడి చేరుకొని నరేష్‌ను పట్టుకొని బయటకు తీసుకెళ్లి విచారించగా.. భక్తురాలి మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించేందుకు యత్నించానని ఒప్పుకున్నాడు. అంతేకాకుండా మధ్యాహ్నం ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించానని, అది జేబులో వేసుకుంటే ఎక్కడో పడిపోయిందని ఎస్‌పీఎఫ్ పోలీసులకు నిందితుడు వివరించాడు. ఎస్‌పీఎఫ్ ఏఎస్‌ఐలు రాజు, రాజయ్య, కానిస్టేబుళ్లు పట్టుబడిన దొంగను యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్‌కు అప్పగించారు.

బైక్ పైనుంచి పడి యువకుడి దుర్మరణం

చండూరు(గట్టుప్పల్): బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడి యువకుడు మృతిచెందిన ఘటన గట్టుప్పల్ శివారులోని పుట్టపాక రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల పరిధిలోని తంగెడుపల్లి గ్రామానికి చెందిన ఆకిటి గణేష్(22) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం చండూరు మండలంలోని అంతంపేట గ్రామంలో తన స్నేహితులను కలిసేందుకు వచ్చి రాత్రి తిరిగి తన స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. రాత్రి 11గంటల సమయంలో గట్టుప్పల్ శివారులోని పుట్టపాక రోడ్డులో గుంతలను గమనించకపోవడంతో బైక్ పైనుంచి అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో గణేష్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ దారి గుండా వెళ్లే ప్రయాణికులు గమనించి ఘటనా స్థలంలో దొరికిన మృతుడి సెల్‌ఫోన్ ద్వారా అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బుధవారం మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

అన్ని రంగాల్లో మాలలకు అన్యాయం జరుగుతోంది

- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి


మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు మీసాల సతీష్‌ను సన్మానిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్: అన్ని రంగాల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల మాలమహానాడు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణాలో మాలలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోయారని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన దళిత బంధు పథకానికి మాలలు, మాదిగలకు సమాన నిష్పత్తిలో ఎంపిక చేయాలని కోరారు. మాలలందరూ రాజకీయాలకతీతంగా ఒకే వేదిక పైకి వచ్చి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ మాలమహానాడు అధ్యక్షుడిగా మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్‌కు చెందిన మీసాల జగదీష్‌ను నియమించారు. అనంతరం ఆయనకు తాళ్లపల్లి రవి నియామక పత్రం అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదుగుల శ్రీనివాస్, మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొప్పని నగేష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గండమళ్ల జానయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూతం అర్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగటి జోసఫ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జం సాయి, మీసాల దేవేందర్ తదితరులున్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు


ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, శ్రీస్వామి వారికి బాలభోగం, తర్వాత మూలవర్యులకు నిజాభిషేకం చేసి అలంకరించారు. అదే విధంగా శ్రీస్వామివారికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన గావించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్యకల్యాణం, తిరువీధి జోడు సేవ నిర్వహించారు. రాత్రి పవళింపు సేవ చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

సమ్మెలో కార్మికులు.. పల్లె పనుల్లో సర్పంచ్‌లు


నార్కట్‌పల్లి : చౌడంపల్లిలో చెత్త సేకరిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్


ఆత్మకూరు(ఎం)లో గేట్ వాల్వ్ తిప్పుతున్న సర్పంచ్ జన్నాయికోడె నగేష్

ఆత్మకూరు(ఎం), నార్కట్‌పల్లి: వారం రోజుల నుంచి గ్రామపంచాయతీల కార్మికులు సమ్మె చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఇతర పనులు కూడా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆత్మకూరు(ఎం) సర్పంచ్ జన్నాయికోడె నగేష్ గ్రామానికి తాగునీరు సరఫరా చేసేందుకు స్వయంగా గేట్ వాల్వ్‌లు తిప్పారు. ఇదే మండలం కప్రాయపల్లి సర్పంచ్ భర్త సామ శ్రీనివాసరెడ్డి, అలాగే నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లి సర్పంచ్ దుబ్బ మధు, ఉప సర్పంచ్ దామర ఉదయ్‌కుమార్ ట్రాక్టర్ల ద్వారా ఆయా గ్రామాల్లో చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తుండడంతో గ్రామంలో చెత్త పేరుకుపోయిందని, గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

కుక్కల కళేబరాలకు పోస్టుమార్టం


పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు

వలిగొండ: మండలంలోని ఆరూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మత్స్యగిరి గుట్ట వద్ద శనివారం గుర్తుతెలియని వ్యక్తులు కుక్కలకు విషాహారం ఇచ్చి చంపి, గ్రామం పక్కన గోతిలో పాతిపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఆరూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా బుధవారం తహసీల్దార్ గణేష్‌నాయక్, ఎస్‌ఐ ప్రభాకర్, పశువైద్యాధికారులు రాంమోహన్‌రెడ్డి, సంధ్య, సిబ్బంది కలిసి కుక్కలను పాతిన గుంతను జేసీబీతో తవ్వి కుక్కల కళేబరాలను బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. వాటి అవయవాలను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపనున్నట్లు పశువైద్యాధికారులు తెలిపారు.

నేడు ఆలేరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

ఆలేరు రూరల్: ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో గురువారం స్థానిక ఏఎస్ఆర్ గార్డెన్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గొంగిడి సునీత తెలిపారు. బుధవారం ఆమె ఆలేరులోని తన క్యాంప్ కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరవుతారన్నారు. పాల శీతలీకరణ కేంద్రం నుంచి భారీ ప్రదర్శన ఉంటుందన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు బుధవారం వేదమంత్రాలతో నిర్వహించారు. ఈసందర్భంగా సుప్రభాత సేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం రక్తికట్టించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు ఉన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

- భార్య మృతి, భర్తకు గాయాలు
- దారి వెంట ఇష్టానుసారంగా భూమిని తవ్వడంతోనే ప్రమాదం
- ప్రైవేటు గోదాము నిర్వాహకుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం
- మృతదేహంతో 6గంటల పాటు గోదాము ఎదుట ఆందోళన


జానమ్మ (ఫైల్)


బోల్తా పడిన ట్రాక్టర్

మాడుగులపల్లి: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడడంతో భార్య మృతిచెందగా భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మాడుగులపల్లి మండలంలోని కొత్తగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం గ్రామానికి చెందిన సింగం సైదులు అదే గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద ఏడెకరాలకు పైగా భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. బుధవారం ఉదయం సైదులు తన భార్య జానమ్మ (35)తో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లారు. పనులు ముగించుకొని మధ్యాహ్నం భోజనానికి ట్రాక్టర్‌లో ఇంటికి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి దారి కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ కింద పడిన జానమ్మ తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందగా.. సైదులుకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన..

ప్రైవేటు గోదాము నిర్వాహకులు పొలాలకు వెళ్లే దారి వెంట భూమిని ఇష్టానుసారంగా తవ్వడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ గ్రామస్తులు గోదాము ఎదుట ఆందోళనకు దిగారు. గ్రామస్తులు భారీగా గోదాము ఎదుటకు చేరుకొని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు సర్దిచెప్పినా బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. రాత్రి 7గంటల వరకు ఆందోళన కొనసాగింది. యాజమాన్యం దిగివచ్చి మృతురాలి కుటుంబానికి సాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బాట వెంట భూమిని తవ్వడంతోనే ప్రమాదం..

ప్రైవేట్ గోదాము నిర్వాహకులు రైతులు పొలాలకు వెళ్లే బాటకు దిగువగా భూమికి 10 ఫీట్లకు పైగా తవ్వడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. బాట వెంట భూమిని ఇష్టానుసారంగా తవ్వడంతోనే ట్రాక్టర్ మలుపు తీసుకునేందుకు స్థలం సరిపోక అదుపుతప్పి దిగువకు దూసుకెళ్లి పల్టీ కొట్టిందని ఆరోపించారు. గోదాము యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు పోతున్నాయని మండిపడ్డారు. అధికారులు స్పందించి గోదాము యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.